క్లుప్తంగా


ఎంపీకి శుభాకాంక్షలు



ఎంపీ మల్లు రవిని సన్మానిస్తున్న నేతలు

షాద్‌నగర్: నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి జన్మదినం సందర్భంగా షాద్‌నగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ నేతలు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని ఎంపీ మల్లురవి నివాసానికి వెళ్లిన నేతలు ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు దంగు శ్రీనివాస్‌యాదవ్, ముబారక్ అలీఖాన్, పొగాకు ప్రకాశ్, సయ్యద్ ఖాదీర్, మనీశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలను సరిచేసిన అధికారులు



సాక్షి ఎఫెక్ట్..

మొయినాబాద్: వ్యవసాయ పొలంలో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను అధికారులు కొత్త స్తంభం పాతి సరిచేశారు. మండల పరిధిలోని పెద్ద మంగళారం సూర్యదేవాలయం సమీపంలోని వ్యవసాయ పొలాల్లో తలకు తగిలేంత ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలపై 'ప్రమాదకరంగా విద్యుత్ తీగలు' అనే శీర్షికతో శనివారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. విద్యుత్ ఏఈ రాజేశ్‌బాబు ఆదివారం వేలాడుతున్న విద్యుత్ తీగలను పరిశీలించారు. వ్యవసాయ పొలం మధ్యలో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలను గుర్తించి వెంటనే కొత్త స్తంభం పాతించి విద్యుత్ తీగలను సరిచేయించారు. విద్యుత్ తీగలను సరిచేయడంతో రైతులు 'సాక్షి'కి ధన్యవాదాలు తెలిపారు.

శిథిలమైన ఇంటితో భయాందోళన



పెద్దఎల్కిచర్లలో శిథిలావస్థకు చేరిన ఇల్లు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్ల గ్రామంలో ఓ ఇల్లు పాడుబడి శిథిలావస్థకు చేరింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పైకప్పు గోడలు కూలిపడుతున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. ఇట్టి ఇల్లు గ్రామం మధ్యలో ఉండటంతో ఎప్పుడు కూలిపడి ఎలాంటి ప్రమాదాలు సంభవిస్తాయోనని భయపడుతున్నారు. శిథిలావస్థకు చేరిన ఇల్లు గ్రామంలో ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకావం ఉందని, చిన్నపిల్లలు అక్కడికి వెళ్తే ఎలాంటి ప్రమాదాలు జరుగుతాయోనని ఆందోళనకు గురవుతున్నారు. విషపూరిత కీటకాలు సంచరించే అవకాశం ఉందని భయపడుతున్నారు. ఈవిషయమై పలుమార్లు అధికారులకు తెలిపినా ప్రయోజనం లేదని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తగుచర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన పామెన భీంభరత్



సీఎం రేవంత్‌రెడ్డితో భీంభరత్

చేవెళ్ల: సీఎం రేవంత్‌రెడ్డిని చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం సాయంత్రం ఆయన సీఎం నివాసంలో కలిసి ఆయనతో కాసేపు నియోజకవర్గ అంశాలకు సంబంధించిన పలు అంశాలపై మాట్లాడారు. పలు అభివృద్ధి పనులపై చర్చించినట్లు భీంభరత్ తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతే లక్ష్యం

తుర్కయంజాల్: వర్షాకాలంలో దోమల ఉధృతి ఎక్కువగా ఉంటున్నందున ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ అమరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇళ్లలో నీరు చేరకుండా చూసుకోవాలని, కనీసం వారానికి ఒకసారి నిల్వ ఉన్న నీటిని పారబోయాలని సూచించారు. దోమల నివారణకు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తగిన చర్యలు చేపడుతున్నామన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా స్వచ్ఛ ఆటో సిబ్బందికి అందించాలని కోరారు.

సీజనల్‌పై అప్రమత్తం

- వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు
- అవగాహన కల్పిస్తున్న వైద్యారోగ్యశాఖ
- వ్యాధులు ప్రబలితే తక్షణమే చికిత్స అందించేందుకు ఏర్పాట్లు



షాబాద్‌లో మందులు పిచికారీ చేయిస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)

చేవెళ్ల: వానాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై జిల్లా వైద్యారోగ్యశాఖ అప్రమత్తమైంది. డెంగీ, మలేరియా, డయేరియా వంటి వ్యాధులకు ఆదిలోనే అడ్డుకట్ట వేసేందుకు అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టారు. వ్యాధుల వ్యాప్తి కారకాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఈగలు, అపరిశుభ్రత, నిల్వ నీరు, మురుగునీరు, దోమకాటుతో అతిసారి, కామెర్లు, టైఫాయిడ్, మలేరియా కలరా డెంగీ తదితర వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని అప్రమత్తం చేస్తున్నారు. వ్యాధులబారిన పడితే వైద్యసిబ్బంది అందుబాటులో ఉంటూ తక్షణ వైద్య సేవలు అందించాలని ఆదేశాలు జారీ చేశారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా..

వాతావరణం చల్లబడడంతోపాటు ప్రతి రోజూ ఓ మోస్తరు నుంచి ముసురు కురుస్తున్నది. దీంతో సీజనల్ వ్యాధులు కూడా ప్రబలే అవకాశాలున్నాయి. ఇప్పటికే చలి, జ్వరాలతో ఆసుపత్రులకు క్యూ కడుతున్న వారి సంఖ్య పెరుగుతున్నది. టైఫాయిడ్ జ్వరాలతో మొదలై సీజనల్ వ్యాధులు విజృంభించే అవకాశం ఉండడంతో ఆదిలోనే అరికట్టేందుకు అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు.

డెంగీ..

డెంగీని వ్యాపింపచేసే దోమ పగటిపూట మాత్రమే కుడుతుంది. దోమ కుట్టిన వారం తర్వాత ఒక్కసారిగా తీవ్ర జ్వరం వస్తుంది. ఎముకలు, కండరాల్లో భరించలేని నొప్పులు కలుగుతాయి. నోరు ఎండిపోవడం, అధిక దాహం, శరీరంపై ఎర్రటి దద్దుర్లు, బీపీ తగ్గడం లక్షణాలు కనిపిస్తాయి. డెంగీకి కారణమయ్యే దోమ నల్లగా ఉండి తెల్లని మచ్చలు ఉంటాయి. పగటి పూట ఎక్కువగా సంచరిస్తుంది. మూతల్లేని నీటి ట్యాంకులు, రోడ్లపై నిలిచే నీరు, పాత టైర్లు, కూలర్లలో నిల్వ ఉండే నీటిలో డెంగీ కారక దోమ పెరుగుతుంది.

డయేరియా..

వర్షాకాలంలో వచ్చే మరో వ్యాధి డయేరియా. కలుషిత నీరు, నిల్వ ఉంచిన ఆహారం తీసుకోవడంతో ఈ వ్యాధి వస్తుంది. వ్యాధి సోకిన వారికి నీళ్ల విరేచనాలతో పాటు జ్వరం వచ్చే అవకాశం ఉంటుంది. రోజులో 4 నుంచి 5 సార్లు విరేచనాలు అయితే డయేరియాగా గుర్తించాలి. ఎక్కువ సార్లు విరేచనాలు కావడంతో శరీరంలోని నీరు, లవణా లు, పొటాషియం, గ్లూకోజ్ శాతం తగ్గి నీరసించిపోతారు. డయేరియా వచ్చిన వారి నుంచి చిన్న పిల్లలను దూరంగా ఉంచాలి. షుగర్ వ్యాధిగ్రస్తులు, చిన్నారులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిపై వ్యాధి ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

మలేరియా..

మలేరియాను వ్యాపింపజేసే దోమలు మురుగు కాల్వల్లోని నీటిలో పెరుగుతాయి. వ్యాధిని సకాలంలో గుర్తించి చికిత్స చేయించుకోకుంటే ప్రమాదకరం. లివర్ కిడ్నీ, రక్తనాళాలు, మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతాయి.

జాగ్రత్తలు తప్పనిసరి



వర్షాల కారణంగా నీటి నిల్వలతో వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉంది. ఇప్పటివరకు ప్రభుత్వ ఆస్పత్రులల్లో డెంగీ కేసులు నమోదు కాలేదు. కానీ ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలి.

– డాక్టర్ దామోదర్, జిల్లా ఉపవైద్యాధికారి

మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న చంద్రశేఖర్‌చారి, ఆంజనేయులు, తదితరులు

చేవెళ్ల: గ్రామీణ ప్రాంత ప్రజలకు స్వచ్ఛమైన తాగు నీటిని సరఫరా చేసేందుకు దాతలు ముందుకురావడం అభినందనీయమని అంబేడ్కర్, మిత్ర చైతన్య యువజన సంఘాల అధ్యక్షులు వడ్ల చంద్రశేఖర్‌చారి, అక్కమొల ఆంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం షాబాద్ మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో బాల వికాస స్వచ్ఛంద సంస్థవారి సహకారంతో (ఏటీడబ్ల్యూ)ఎనీ టైం వాటర్ ప్లాంట్‌ను సంస్థ ఆర్గనైజర్ వినోద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజలకు స్వచ్ఛమైన నీటిని అందించేందుకు కృషి చేసిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. వర్షాకాలంలో ప్రజలు మంచినీరు తాగడంతో రోగాల బారిన పడకుండా ఉంటారని చెప్పారు. గ్రామస్తులందరూ ఇంటింటికీ రూ.500 రూపాయలు చందా వేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తపల్లి లక్ష్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ మద్దూరు పాండు, గ్రామస్తులు రమేశ్ పంతులు, జంగయ్య, మల్లేశ్, లోక్‌నాథ్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, కరుణాకర్‌రెడ్డి, బాల్‌రాజ్, రాములు, పురుషోత్తంచారి, సుమన్, శ్రీనువాస్, ప్రవీణ్, కుమార్ తదితరులు ఉన్నారు.

కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలి

కొత్తూరు: మండలంలోని ఆయా పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్‌తో పాటు పలు సౌకర్యాలు కల్పించాలని సీపీఐ మండల కార్యదర్శి షకీల్ పరిశ్రమల యాజమాన్యాలను ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. స్థానికంగా కొనసాగుతున్న పలు పరిశ్రమల్లో కార్మికులకు యాజమాన్యాలు కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. అంతేకాకుండా వారిని 8 గంటలకు బదులుగా 12 గంటలు పనిచేయిస్తూ శ్రమ దోపిడీకి గురిచేస్తున్నట్లు ఆరోపించారు. కార్మికుల సంక్షేమం కోసం కృషి చేయాల్సిన కార్మికశాఖ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంతో కార్మికులు అన్యాయానికి గురవుతున్నారని వాపోయారు. ఇప్పటికైనా కార్మికశాఖ అధికారులు స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దశరథ్‌నాయక్

కడ్తాల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు, రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జర్పుల దశరథ్‌నాయక్ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ అమ్మవారిని ఆయన మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్‌తో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ దైవచింతన, సేవా గుణం అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు వారిని పూలమాల వేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాండు, మహేశ్‌గౌడ్, లక్ష్మణ్, గణేశ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

చేవెళ్ల: 12 ఏళ్ల తర్వాత ఒకచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు వారి విద్యార్థి దశ జీవితాన్ని గుర్తు చేసుకుంటూ ఆనందించారు. చేవెళ్ల మండలంలోని ఓ ఫామ్ హౌస్‌లో ఆదివారం చేవెళ్ల జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల 2011–12 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులందరూ ఒక చోట చేరి చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు వారికి చదువులు చెప్పిన నాగరాణి, రాజు, యాదయ్య, యాదిలాల్, యాదగిరి, సత్యం, మల్లేశ్, మంజుల, రమేశ్ గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలోనే సంతృప్తి

ఎమ్మెల్యే సబితారెడ్డి



దివ్యాంగులకు ట్రైసైకిళ్లు అందిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

కందుకూరు: ప్రజా సమస్యలను పరిష్కరించడంలోనే ఆత్మ సంతృప్తి ఉంటుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి అన్నారు. దివ్యాంగులైన మండల పరిధిలోని మాన్యగూడకు చెందిన ఎగిరిశెట్టి రాజు, కటికపల్లికి చెందిన సుధాకర్‌కు ఇటీవల వారికి ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బ్యాటరీ ట్రైసైకిళ్లను సబితారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఎవరికి ఎలాంటి సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ప్రాధాన్యతా క్రమంలో ఆయా గ్రామాలకు అవసరమైన నిధులు కేటాయించేలా కృషి చేస్తున్నానన్నారు. అభివృద్ధి పనుల విషయంలో రాజకీయాలతో పనిలేదని, పార్టీలకతీతంగా అందరం కలిసి ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దాసర్లపల్లి మాజీ సర్పంచ్ దేవేందర్ పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేపట్టాలి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 31వ డివిజన్ గ్రీన్‌రిచ్ కాలనీ, శ్రీవిద్యటౌన్‌షిప్ కాలనీల్లో ఆదివారం మేయర్ పారిజాత నర్సింహారెడ్డి పర్యటించారు. బోనాల పర్వదినాలను దృష్టిలో ఉంచుకుని రోడ్లు ఎక్కడ దెబ్బతిన్నా వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కాలనీల్లో ఉన్న ఆలయాలను పరిశీలించి అందంగా అలంకరించేలా ఏర్పాట్లు చేయాలని సిబ్బందిని కోరారు. కాలనీ వాసులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. బోనాలు పూర్తికాగానే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సుదర్శన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్యామ్‌సుందర్‌రెడ్డి, నారాయణగౌడ్, లక్ష్మారెడ్డి, శ్రవణ్‌కుమార్, మోహన్‌కృష్ణ పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు

చేవెళ్ల గురుకుల పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీనివాస్



ప్రిన్సిపాల్ రమాదేవిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు

మొయినాబాద్‌రూరల్: ప్రతి ప్రభుత్వ ఉద్యోగి అంకితభావంతో పనిచేస్తేనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని చేవెళ్ల సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కమిటీ చైర్మన్ బ్యాగరి శ్రీనివాస్ అన్నారు. మండల పరిధిలోని తోల్‌కట్ట గ్రామ సమీపంలో గల చేవెళ్ల గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి బదిలీ కావడంతో సన్మాన కార్యక్రమాన్ని పాఠశాల ఉపాధ్యాయులు, కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ బ్యాగరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమేనన్నారు. ఏడు సంవత్సరాలుగా ప్రభుత్వ ఉద్యోగి తమ బాధ్యతగా పాఠశాల, కళాశాలను ఎంతో అభివృద్ధి చేశారని ప్రభుత్వపరంగా విద్యార్థుల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. అలాంటి ప్రిన్సిపాల్‌ను పిల్లలు వారి తల్లిదండ్రులు ఎన్నటికీ మరచిపోలేరని తెలిపారు. అనంతరం బదిలీ అయిన ప్రిన్సిపాల్ రమాదేవి మాట్లాడుతూ.. ప్రభుత్వపరంగా పైఅధికారుల సూచనల మేరకు విద్యార్థుల అభివృద్ధికి కృషి చేశానన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అన్ని విధాలుగా కృషి చేశానని పేర్కొన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో పాఠశాల మేనేజ్ కమిటీ సభ్యులు గిరిబాబు, లక్ష్మణ్, శ్రీకాంత్, శ్రీనివాస్, పాఠశాల ప్రిన్సిపాల్ కల్పన, అమరావతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కుంగ్‌ఫూలో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

కొందుర్గు: న్యూమాంక్స్ కుంగ్‌ఫూ అసోషియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కొందుర్గు మండల కేంద్రంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ గ్రామాలకు చెందిన 100 మంది విద్యార్థులు హాజరై తమ ప్రతిభ చాటారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లాకు చెందిన రాము మాస్టర్ విద్యార్థులకు కటాస్, స్పైరింగ్ విభాగాల్లో పలు మెలకువలను వివరించారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అసోషియేషన్ జిల్లా అధ్యక్షుడు రాజేశ్‌పటేల్, మాస్టర్లు రమేశ్, రాజు, నందు, బాల్‌రాజ్, నరేశ్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బోనాల ఉత్సవాలు



బోనాల ఊరేగింపు

చేవెళ్ల: మండల కేంద్రంలోని వీరభద్ర కాలనీలో ఆషాఢమాసం బోనాల ఉత్సవాలు ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆయా అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువకుల కేరింతల మధ్య మహిళలు బోనాల ఊరేగింపు ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా కాలనీ పెద్దలు భక్తులకు ఇబ్బంది లేకుండా కావాల్సిన ఏర్పాట్లు చేశారు. వేడుకల్లో గ్రామ పెద్దలు, కాలనీ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టులు బాధాకరం



పోలీస్ వాహనంలో ఎక్కుతున్న బీఆర్ఎస్ యువజన నాయకుడు నిట్టు జగదీశ్వర్

ఇబ్రహీంపట్నం: ముందస్తు అరెస్టులు బాధాకరమని బీఆర్ఎస్ యువజన నేతలు పేర్కొన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం పర్యటించిన నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు పోలీసులు బీఆర్ఎస్ యువజన నేతలను ముందస్తు అరెస్టులు చేశారు. రాష్ట్రంలో డీఎస్సీ పరీక్షలను వాయిదా వేయాలని బీఆర్ఎస్‌తో పాటు వివిధ సంఘాలు, నిరుద్యోగులు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి పాల్గొనే సభకు ఎలాంటి అంతరాయం కలుగకుండా ఉండేందుకు అరెస్టులు చేసినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టయిన వారిలో నిట్టుజగదీశ్వర్, జెర్కొని రాజుతోపాటు మరో నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సీఎం సభ పూర్తయిన అనంతరం వారిని విడిచిపెట్టినట్లు అధికారులు తెలిపారు.

కోతులు.. బాబోయ్

- గుంపులు గుంపులుగా వానరాల సంచారం
- పంటలను నాశనం చేస్తున్నాయని రైతుల ఆవేదన
- అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణ



విశ్వనాథ్‌పూర్‌లో పొలాల వద్ద గుంపులుగా ఉన్న కోతులు

కొందుర్గు: అప్పులు చేసి సాగుచేసిన పంటలను కోతులు నాశనం చేస్తున్నాయని కొందుర్గు మండలంలోని విశ్వనాథ్‌పూర్ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విశ్వనాథ్‌పూర్ గ్రామంలో బంతి, చామంతి, గులాబీ పూల సాగుతో పాటు టమాటా, చిక్కుడు, మిరప, వంకాయ తదితర కూరగాయల పంటలను సాగుచేస్తారు. అదేవిధంగా వరి, చెరుకు, జొన్న, గోధుమ పంటలను సాగు చేస్తారు. ఏడాది ఖరీఫ్‌లో దాదాపు 1000 ఎకరాల విస్తీర్ణంలో పంటలను సాగుచేసినట్లు రైతన్నలు చెబుతున్నారు. అయితే అప్పులు చేసి పెట్టుబడులు పెట్టి పంటలను సాగుచేస్తే కోతులు నాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట పొలాల్లో గుంపులు, గుంపులుగా కోతులు తిరుగుతూ పంటలను తొక్కి పాడుచేస్తున్నాయని, కూరగాయల పంటలను ధ్వంసం చేస్తున్నాయని వాపోతున్నారు. ఇళ్ల పైకప్పులపై నుంచి దూకుతూ పెంకుటిళ్లను పాడుచేస్తున్నాయని, చిన్నారులు ఇంట్లో నుంచి బయటకు వెళ్లాలంటేనే భయపడుతున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. కోతులను వెళ్లగొట్టాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం దక్కడం లేదని, కోతుల బెడద నుంచి తమను కాపాడాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎన్ని ప్రయత్నాలు చేసినా..



కోతులను వెళ్లగొట్టాలని ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం కనిపించడం లేదు. డప్పులు కొట్టినా, బాంబులు పేల్చినా ఫలితం లేదు. పెద్ద శబ్దాలు చేసినప్పుడు వెళ్లిపోతాయి. మళ్లీ తిరిగి వస్తున్నాయి.

–మహేశ్వర్‌రెడ్డి, రైతు, విశ్వనాథ్‌పూర్

పంటలను నాశనం చేస్తున్నాయి..



ఎంతో కష్టపడి దొరికిన చోటల్లా అప్పులు చేసి పంటలు సాగు చేస్తే కోతులు పంటలను నాశనం చేస్తున్నాయి. మిరప, టమాటా, చిక్కుడు పంటలను సాగుచేస్తే కోతులు పంటలను పీకేస్తున్నాయి. కోతుల బాధకు ఏగలేకపోతున్నాం.

– మల్లయ్య, రైతు, విశ్వనాథ్‌పూర్